


తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 01 | సోమవారం | 27 - 07 - 2026 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజీలు : 1


# ఎమ్మెల్యే సామేల్‌కు మాస్టర్ స్ట్రోక్




## కాంగ్రెస్‌కు రాజీనామా చేసేందుకు సిద్ధమవుతున్న కౌన్సిలర్లు

## మున్సిపల్ ఎన్నికల్లో 12 వార్డులకు 9 వార్డులు గెలిచి మున్సిపాలిటీ కైవసం చేసుకున్న కాంగ్రెస్

## ఎమ్మెల్యే సామేల్ అణిచివేతను తట్టుకోలేకపోతున్నామంటున్న కౌన్సిలర్లు


## ఇప్పటికే మున్సిపాలిటీలో చైర్మన్ భర్తతో తీవ్ర విభేదాలు

## కౌన్సిలర్ల రాజీనామాతో అధికార పార్టీకి ఎదురుదెబ్బ

## నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ ఖతం..?

**ప్రజావారధి/మోత్కూరు**

తుంగతుర్తి కాంగ్రెస్‌లో పంచాది రోజుకో మలుపు తిరుగుతోంది. కోమటిరెడ్డి బ్రదర్స్, ఎంపీ చామలపై ఎమ్మెల్యే సామేల్ చేసిన కామెంట్స్‌తో కాంగ్రెస్ కుతకుత ఉడుకుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సామేల్‌కు మోత్కూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ కౌన్సిలర్లు మాస్టర్ స్ట్రోక్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఎమ్మెల్యే సామేల్ ఒంటెద్దు పోకడలతో విసిగిపోతున్న కౌన్సిలర్లు ఇక పార్టీలో ఉండి చేసేందేం లేదని భావించి కాంగ్రెస్‌కు రాజీనామా చేసేందుకు సిద్ధమవుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఒకట్రెండు రోజులుగా కాంగ్రెస్ కౌన్సిలర్లు ఇదే విషయంపై సమాలోచనలు చేస్తున్నట్టు తెలిసింది. రూ.15 కోట్ల టెండర్‌పై నెలకొన్న వివాదంతో మొదలైన ఈ పంచాది కాంగ్రెస్ కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేయాలన్న ఆలోచన వరకు వెళ్లింది. మున్సిపల్ ఎన్నికల్లో మోత్కూరు మున్సిపాలిటీలో 12 వార్డులు ఉండగా 9 వార్డుల్లో కాంగ్రెస్, మూడు వార్డుల్లో బీఆర్ఎస్ గెలిచింది. చైర్మన్ ఎన్నిక సమయంలో కూడా చైర్మన్ పదవికి మరో ఇద్దరు కౌన్సిలర్లు కూడా పోటీ పడటం, మిగతా కౌన్సిలర్లు కూడా సంత-ప్తి చెందకపోవడంతో నాటి నుంచే కౌన్సిలర్లలో అసంతృప్తి నెలకొంది. ఇదిలా ఉండగానే అప్పటికే మున్సిపాలిటీకి మంజూరైన రూ.15 కోట్ల నిధులకు సంబంధించి కౌన్సలర్లకు చెప్పకుండానే ఎమ్మెల్యే సామేల్ పనులు ఖరారు చేసి టెండర్ వేయించగా సింగిల్ టెండర్‌తో ఆ పనులను సామేల్ అనుచరుడు దక్కించుకున్నారు. దీంతో ఆగ్రహించిన కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరుగురు, బీఆర్ఎస్ కౌన్సిలర్లు ముగ్గురు మొత్తం 9 మంది మెజార్టీ సంతకాలతో తీర్మానం చేసి టెండర్ రద్దు చేయించారు. మళ్లీ ఇటీవల రూ.15 కోట్ల




నిధులకు కౌన్సిలర్లకు చెప్పకుండా టెండర్ వేయడంతో వారు అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో రెండోసారి కూడా రద్దయ్యింది. మున్సిపాలిటీలో నాలుగు కోఆప్షన్ పదవులను సైతం ఎమ్మెల్యే ఏకపక్షంగా కట్టబెట్టేందుకు ప్రయత్నించగా కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆ నియామకాలను కూడా అడ్డుకోవడంతో నేటికీ ఆ పదవులు భర్తీ కాకుండానే అలానే పెండింగ్‌లో ఉన్నాయి. మున్సిపల్ ఖాతాలో నిల్వ ఉన్న రూ.కోటి 27 లక్షల నిధుల్లో గత నెల రోజుల్లో చైర్మన్ భర్త ఏకపక్షంగా రూ.48 లక్షలు డ్రా చేశారని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే సామేల్, చైర్మన్ భర్త ఏకపక్ష నిర్ణయాలు, ఒంటెద్దు పోకడలతో విసిగిపోతున్నామని, ఎమ్మెల్యే సామేల్ తమను దగ్గరకు రానివ్వకుండా కనీసం లెక్క చేయడం లేదని, తమ వార్డుల్లో అభివృద్ధి పనులు చేయక ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీలో ఉన్నామన్న పేరే గాని తాము చెప్పిన పనులేవీ కావడం లేదని, అలాంటప్పుడు కాంగ్రెస్‌లో ఉండి చేసేదేముందని, పార్టీకి రాజీనామా చేసి స్వతంత్ర కౌన్సిలర్లుగా కొట్లాడైనా పనులు చేసుకుంటామన్న భావనలో కౌన్సిలర్లు ఉన్నట్టు తెలుస్తోంది.

### కౌన్సిలర్ల రాజీనామాతో అధికార పార్టీకి ఎదురుదెబ్బ

కాంగ్రెస్ కౌన్సిలర్లు రాజీనామా చేసిన పక్షంలో అధికార కాంగ్రెస్‌కు గట్టి ఎదురు దెబ్బ తగలనుంది. తుంగతుర్తి నియోజకవర్గంలో మోత్కూరు, తిరుమలగిరి మున్సిపాలిటీలు ఉండగా ఎన్నికల్లో తిరుమలగిరి మున్సిపాలిటీలో ఘోరంగా ఓటమి పాలవ్వగా, ఇప్పుడు అధికార కాంగ్రెస్ చేతిలో ఉన్న మోత్కూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ కౌన్సిలర్లు రాజీనామా చేసే పక్షంలో అధికార పార్టీ చేజారిపోనుంది. మున్సిపల్ ఎన్నికల్లో 12 వార్డులకు గాను 8 వార్డుల్లో కాంగ్రెస్, 3 వార్డుల్లో బీఆర్ఎస్ గెలువగా, ఒక వార్డులో స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. ఎన్నికల అనంతరం స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన 5వ వార్డు కౌన్సిలర్ మొగుళ్ల అనురాధ కాంగ్రెస్‌లో చేరడంతో కాంగ్రెస్ బలం 9కి చేరింది. 9 మంది కౌన్సిలర్లలో చైర్మన్‌తో పాటు మరో ఇద్దరు కౌన్సిలర్లు ఎమ్మెల్యే వర్గంగా ఉండగా, మరో ఆరుగురు కౌన్సిలర్లు ఎంపీ చామల, కోమటిరెడ్డి బ్రదర్స్ వర్గంగా ఉన్నారు. ఎమ్మెల్యే వర్గంగా ఉన్న ఓ కౌన్సిలర్ కూడా ప్రస్తుతం ఆరుగురు కౌన్సిలర్లతో కలిసినట్టు తెలిసింది. దీంతో ఎమ్మెల్యే సామేల్‌ను విభేదిస్తున్న కౌన్సిలర్ల సంఖ్య ఏడుకు పెరిగింది. కోమటిరెడ్డి బ్రదర్స్, ఎంపీ చామలపై ఎమ్మెల్యే సామేల్ చేసిన కామెంట్స్‌ను ఇప్పటికే మెజార్టీ కాంగ్రెస్ కేడర్ జీర్ణించుకోవడం లేదు. కాంగ్రెస్ కౌన్సిలర్లు రాజీనామా చేసిన పక్షంలో ఎమ్మెల్యే సామేల్‌కు మాస్టర్ స్ట్రోక్‌తో పాటు ఇప్పటికే పొట్టు పొట్టు..పొల్లు పొల్లుగా నడుస్తున్న పంచాది కాస్తా నజ్జునజ్జు కానుంది. కాంగ్రెస్ కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేసి స్వతంత్రంగా ఉండి బీఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి ఆ బలం పదికి పెరిగి మున్సిపాలిటీలో ఎమ్మెల్యే సామేల్‌కు, చైర్మన్ భర్తకు పూర్తిగా చెక్ పెట్టవచ్చన్న వ్యూహం రచిస్తున్నట్టు తెలుస్తోంది.